

ఇంటింటా పాడిపంట
పేరుకే అది పల్లె. చూస్తే పట్టణాన్ని తలపిస్తుంది. పల్లె చుట్టూ ఉన్న సారవంతమైన భూములు రైతులకు పంట సిరులు కురిపిస్తున్నాయి.
- 10లో



జూలైలో తోటపల్లి నీరు విడుదల
తోటపల్లి జలాశయం నుంచి వచ్చే ఖరీఫ్ సాగుకు జూలైలో సాగునీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.
- 10లో



వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ
ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వ్యక్తిత్వ వికాసంపై బుధవారం శిక్షణ ఇచ్చారు.
- 10లో

న్యూస్‌రీల్

ఎన్నికల భృతిలో కోతపెట్టడం తగదు



వినతి పత్రాన్ని అందుకుంటున్న కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో విధుల నిర్వహించిన వివిధ కేడర్ ఉద్యోగులకు చెల్లించాల్సిన గౌరవ వేతనంలో కోతవేయడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడ్డారు. ఎన్నికల అధికారులను నిలదీశారు. భోజనం పేరుతో కొన్నిచోట్ల వేతనంలో కోతపెట్టారని ఆరోపించారు. దీనిని సరిచేయాలంటూ కలెక్టరేట్‌లో ఏఓ శ్రీనివాసరావుకు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. శిక్షణ తరగతులని చెప్పి మూడురోజుల, నియోజకవర్గం కేంద్రం నుంచి మెటీరియల్ తీసుకున్నప్పటి నుంచి రిసెప్షన్ (కౌంటింగ్ కేంద్రం) సెంటర్‌కు మెటీరియల్ మరో మూడు రోజులు పనిచేస్తే కేవలం రెండు రోజులకు సరిపడే గౌరవవేతనం ఇచ్చారని ఆరోపించారు. అందులోని రూ.250 వరకు భోజన సౌకర్యం కల్పించామని చెప్పి కొన్ని పోలింగ్ కేంద్రాలలో తగ్గించారని విమర్శించారు. మూడు రోజులకు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయని, విధులకు మినహాయింపు ఇవ్వాలని వినతి ఇచ్చినా రిజర్వ్‌డ్ విధులను చేయాలని మొండి చేయడంతో రిసెప్షన్ సెంటర్ వద్దే కూలిపోయిన ఉద్యోగికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, డి.శ్యామ్, ఇజ్జపు రామునాయుడు, జె.రమేష్‌చంద్రపట్నాయక్, డి.రాము, వెంకటనాయుడు, పి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైందని ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు. ఈ నెల 22వ తేదీలోగా సంబంధిత కళాశాలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. నెలాఖరులోగా తొలివిడత ప్రవేశాలను ముగించి, వచ్చే నెల 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వచ్చేనెల 10వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో 18 ప్రభుత్వ కళాశాలలు, 105 ప్రైవేటు కళాశాలలున్నాయని పేర్కొన్నారు. గత ఏడాది మొదటి సంవత్సర ఇంటర్మీడియట్ కోర్సులలో 4,070 మందికి ప్రవేశాలు జరిగాయని, ఈ ఏడాది పదోతరగతి ఉత్తీర్ణత శాతం పెరిగిన నేపథ్యంలో కనీసం 5 వేలు తగ్గకుండా ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

పరీక్షకు వెళ్తుండగా ప్రమాదం



గజపతినగరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

బొండపల్లి: వారంతా రాత్రంతా కష్టపడి చదివారు. ఉదయం ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం సెమిస్టర్ పరీక్షకు నెల్లిమర్ల మండలంలోని చందకపేట రెవెన్యూ పరిధిలోని సెంచూరియన్ యూనివర్సిటీకి వర్సిటీ బస్సులో బయలుదేరారు. గజపతినగరం నుంచి ఎన్‌హెచ్-26పై ప్రయాణం సాఫీగా సాగిపోతోంది. కొద్ది నిమిషాల్లో కళాశాలకు చేరుకుంటామన్న సమయంలో విద్యార్థులు వెళ్తున్న బస్సును బొండపల్లి మండల కేంద్రానికి సమీపంలో టిప్పర్ బలంగా ఢీకొంది. విద్యార్థుల హాహాకారాలతో ఆ ప్రాంత వాసులు పరుగున వచ్చారు. ప్రమాదంలో గాయపడిన 8 మంది విద్యార్థులతో పాటు బస్సు డ్రైవర్ కృష్ణంరాజును కిందకు దించారు. తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్‌తో పాటు వసంతకుమారి అనే విద్యార్థినిని విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి 108లో తరలించారు. మిగిలిన వారిని గజపతినగరం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు.

రాకపోకలకు అంతరాయం

జాతీయ రహదారిపై ప్రమాదం జరగడం, మధ్యలో వాహనాలు ఉండిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నాలుగు కిలోమీటర్ల మేర ఇరువైపులా వాహనాలు నిలిపోయాయి. గజపతినగరం సీఐ ప్రభాకరరావుతో పాటు బొండపల్లి ఎస్సై కె.లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాలను పక్కకు తీయించారు. రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రమాద కారణాలపై ఆరా తీస్తున్నారు.



జాతీయ రహదారి-26పై నిలిచిన రాకపోకలు



విజయనగరం జిల్లా కొత్తపేట కుమ్మరివీధి ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

నియోజకవర్గాల వారీగా పురుషుల కంటే అధికంగా పోలైన మహిళల ఓట్లు ఇలా...	ఎస్.కోట	విజయనగరం	బొబ్బిలి	గజపతినగరం	నెల్లిమర్ల
	5,345	5,008	3,454	2,960	2,815

ఓటింగ్‌లో పైచేయి ఆమెదే



- ఓటింగ్‌లోనూ మహిళలదే పైచేయి
- రాజాం, చీపురుపల్లి మినహా అన్ని చోట్ల మహిళా ఓట్లే ఎక్కువ
- జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఓటేసిన 6,44,844 మంది మహిళలు
- పురుషుల కంటే అధికంగా 18,537 మంది మహిళా ఓటింగ్ నమోదు



బొద్దాంలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు (ఫైల్)

విజయనగరం అర్బన్: అన్నిరంగాల్లోనూ రాణిస్తున్న మహిళలు జిల్లాలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో సైతం పైచేయిగా నిలిచారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంలో కూడా ముందు వరుసలో ఉన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 15,62,921 మంది ఓటర్లలో 7,92,038 మంది మహిళలు, 7,70,805 మంది పురుషులు ఉన్నారు. జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకున్న 12,71,173 మందిలో పురుషుల కంటే 18,537 మంది మహిళల అదనంగా ఉన్నారు. రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో మినహా అన్ని చోట్ల మహిళా ఓట్లు అధికంగా నమోదయ్యాయి. ఓటు హక్కు వినియోగించుకోవడంలో స్వల్ప తేడా లున్నా.. అభ్యర్థుల గెలుపోటములపై వారి తీర్పే కీలకంగా మారనుందన్నది స్పష్టమైంది.

వైఎస్సార్‌సీపీకి సానుకూలత

మహిళల ఓటు బ్యాంకు వైఎస్సార్‌సీపీకి సానుకూలత కాగా.. ఆ ఓట్లు తమపై ఎక్కడ ప్రభావం చూపుతాయోనని ప్రతిపక్ష కూటమి నేతలు భయపడుతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం వల్ల అక్కాచెల్లెమ్మలకే నేరుగా లబ్ధి కలిగింది. వృద్ధులకు క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికే పింఛన్ అందించారు. ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన మహిళలు, వృద్ధులు తమ ఓట్లను గుంపగుత్తగా వైఎస్సార్‌సీపీకే వేశారని ఆ పార్టీ నేతలు ధీమాగా చెబుతున్నారు. ప్రతిపక్ష నేతలు సైతం ఈ రెండు వర్గాల ఓట్లపై లెక్కలు వేసుకుంటోంది.

జోరుగా సమీక్షలు

సాధారణ ఎన్నికలు ముగియడంతో గెలుపోటములపై ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి. బూత్‌ల వారీగా పోలైన ఓట్లపై అభ్యర్థులు సమీక్షించుకుంటున్నారు. దాదాపు రెండు నెలలుగా తీరిక లేకుండా ఎన్నికల పనుల్లో ఉన్న నేతలంతా ఇప్పుడు కుటుంబంతో గడుపుతున్నారు. మరోవైపు సాధారణ ప్రజల్లో సైతం ఒక్కటే చర్చ. ఎవరిది విజయమని? ఈ ఉత్కంఠకు జూన్ 4న తెరపడనుంది. జిల్లాలో ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే పోటీ నెలకొనగా.. విజయంపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఓటర్లు తమవైపే ఉన్నారని.. పెరిగిన పోలింగు శాతమే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలయిన ఓట్లు ఇలా..

నియోజకవర్గం	పోలైన మొత్తం ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
రాజాం (ఎస్సీ)	1,72,906	86,928	85,974	4
బొబ్బిలి	1,85,775	91,158	94,612	5
చీపురుపల్లి	1,71,533	85,811	85,720	2
గజపతినగరం	1,77,612	87,325	90,285	2
నెల్లిమర్ల	1,88,456	92,820	95,635	1
విజయనగరం	1,84,787	89,886	94,894	7
ఎస్.కోట	1,90,104	92,379	97,724	1
మొత్తం	12,71,173	6,26,307	6,44,844	22

వైఎస్సార్ సీపీ వైపే.. ప్రజా తీర్పు

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో పునరావృతం కానున్న 2019 ఫలితాలు
- జగన్ నాయకత్వంలో సంక్షేమ పాలనకు మద్దతుగా పెరిగిన పోలింగ్ శాతం
- ఓటమి భయంతో రాష్ట్రంలో కూటమి నేతల హింసాత్మక చర్యలు
- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ వైపు ఉండబోతుందని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, ఆ పార్టీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2019 నాటి ఫలితాలు పునరావృతం అవుతాయని చెప్పారు. విజయనగరంలోని ధర్మపురిలో గల సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం, పార్వతీపురంమన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో దిగిన 19 మంది అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా, నలుగురు ఎంపీలుగా విజయ బావుటా ఎగురవేస్తారన్నారు. విజయనగరం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఉదయం 7 గంటల నుంచి మరుసటి రోజు వేకువజామున 3 గంటల వరకు ఓటింగ్ జరగడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఐదేళ్ల సంక్షేమ పాలనకు మద్దతుగా ప్రజలంతా ఓటు వేసేందుకు తరలివచ్చినట్టు పేర్కొన్నారు. నా ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ పేద, బడుగు, బలహీన వర్గాలకు జరిగిన మంచిని గుర్తించుకుని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సైతం తన ప్రభుత్వంలో మీ కుటుంబానికి మంచి జరిగితేనే ఓటు వేయాలని పిలుపునివ్వడం ఓటర్లలో స్ఫూర్తిని నింపిందన్నారు. అందుకు అనుగుణంగానే తమకు కావాల్సిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారని చెప్పారు. కరోనా కష్ట కాలంలో ఇబ్బందులకు ఎదురొడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రజలకు ధైర్యం చెప్పి అండగా నిలిచిన వైనాన్ని రాష్ట్ర ప్రజలంతా మర్చిపోలేదన్నారు.

ఓటమి భయంతో కూటమి నేతలు హింసాత్మక చర్యలు

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో కూటమి నాయకులు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారని మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల ప్రచార సమయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యా ప్రయత్నానికి ఒడిగట్టినా వెనుకడుగు వేయకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారన్నారు. మరో వైపు వారికి అనుకూల ప్రచార మాధ్యమాల ద్వారా ప్రభుత్వ పాలనపై బురదచల్లినా ప్రజలు నమ్మలేదన్నారు. గెలుపుకోసం ఎన్నికల్లో ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు బెదిరింపులకు దిగినా... కుట్రలు.. కుతంత్రాలకు తెరలేపినా వాటికి బెదరకుండా జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని కొనసాగించుకునేందుకు రేయింబవళ్లు కష్టించి పనిచేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలిపారు.

పోలింగ్ నిర్వహణలో యంత్రాంగం సేవలు అభినందనీయం

2024 సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన జిల్లా యంత్రాంగం అందించిన సేవలు అభినందనీయమని మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చేపట్టిన పటిష్ట చర్యలు సత్ఫలితాన్నిచ్చాయని చెప్పారు. ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నెక్కల నాయుడుబాబు, కె.వి. సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్

- జిల్లా వ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ
- 16,17న బైపీసీ విభాగానికి..18 నుంచి 23 వరకు ఎంపీసీ విభాగానికి పరీక్ష
- జిల్లా వ్యాప్తంగా ఇంజినీరింగ్ పరీక్షకు 12,819 మంది...
- అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 3,122 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ప్రవేశ పరీక్ష (ఏపీఈఏపీసెట్)-2024 గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానుంది. సంబంధిత పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ (బైపీసీ) విద్యార్థులకు ఈ నెల 16, 17 తేదీలలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనుండగా ఇంజినీరింగ్ స్ట్రీమ్ (ఎంపీసీ) విద్యార్థులకు 18 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ పరీక్షను 12,819 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు, 3,122 మంది అగ్రికల్చర్, ఫార్మశీ పరీక్షను ఆన్‌లైన్‌లో రాయనున్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం సెషన్ 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

పరీక్షా కేంద్రాల వివరాలు..

ఈఏపీసెట్ పరీక్ష కోసం విజయనగరంలోని గాజులరేగలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాల, అదే ప్రాంగణంలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఐడీజెడ్, అవంతి ఇంజినీరింగ్ కళాశాల, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల, బొబ్బిలిలోని స్వామి ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గుర్తింపు కార్డులను తీసుకురావాలి

ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గుర్తింపు కార్డులను తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు ఏదైనా సరిపోతుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష రోజున కులధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. విద్యార్థులను ఉదయం సెషన్‌కు సంబంధించి 7.30 గంటల నుంచి, మధ్యాహ్నం పరీక్షకు 1 గంట నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.

కట్టుదిట్టం

విజయనగరం జిల్లాలోని జేఎన్‌టీయూ, లెండి కళాశాలల్లోని స్ట్రాంగ్ రూమ్‌లలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఈవీఎంలను భద్రపరిచారు. రెండు చోట్ల మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అడుగడుగునా పోలీసుల నిఘా ఉంది. సీసీ కెమారాల్లోనూ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



జేఎన్‌టీయూ ముఖద్వారం



స్ట్రాంగ్ రూమ్స్ ఉన్న ముఖద్వారం వద్ద పోలీసుల భద్రత



బయట పోలీసుల పహారా

విత్తన ఎంపికే కీలకం

- నాణ్యమైన విత్తనాలతో దిగుబడి బాగు
- చీడపీడలు దూరం
- ఆర్‌బీకేల్లో సర్టిఫైడ్ విత్తనాలు అమ్మకం
- పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులను భద్రపరచుకోవాలి

సీతంపేట:

వ్యవసాయంలో అత్యంత ప్రధానమైనది విత్తన ఎంపిక. ఇది పంట దశ, దిశను మార్చుతుంది. విత్తన ఎంపిక, కొనుగోలులో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా అన్నదాత నష్టపోవాల్సి వస్తుంది. ఈ విషయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నది వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన. వచ్చేనెల నుంచి ఖరీఫ్ సీజన్ ఆరంభం కానుంది. అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. వేసవి దుక్కులు చేయడంలో రైతులు బిజీ అయ్యారు. వరి నారు, వెదలు జల్లేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరి విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, విత్తనమే దిగుబడులను నిర్ణయిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆర్‌బీకేలలో విక్రయించే సర్టిఫైడ్ విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు.

విత్తనాల లభ్యత ఇలా...

విత్తనాలు బ్రీడర్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రూత్ ఫుల్ లేబుళ్లలో లభిస్తాయి. వీటిని సాగు చేసి మళ్లీ విత్తనాలుగా వినియోగించవచ్చు. దీనివల్ల రైతులకు విత్తన భారం తగ్గుతుంది. బ్రీడర్ విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానాలు, యూనివర్సిటీలు, విత్తన కంపెనీల శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ వేస్తారు. ఈ విత్తనాల ధర ఎక్కువగా ఉంటుంది. ఈ విత్తనాలు షాపుల్లో లభ్యం కావు. బ్రీడర్ విత్తనం నుంచి ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి చేస్తారు. వివిధ ఉత్పత్తి సంస్థలు సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో పండిస్తారు. ఫౌండేషన్ విత్తనానికి తెలుపు రంగు ట్యాగ్ చేస్తారు. ఫౌండేషన్ సీడ్ నుంచి వచ్చే విత్తనాన్ని సర్టిఫైడ్ సీడ్‌గా వ్యవహరిస్తారు. దీనికి నీలి రంగు ట్యాగ్ వేస్తారు. సర్టిఫైడ్ సీడ్ నుంచి వచ్చే విత్తనాలను ట్రూత్ లేబుల్ విత్తనంగా వ్యవహరిస్తారు. దీనికి ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు. సాధ్యమైనంత వరకు రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) లభించే విత్తనాలు కొనుగోలు చేయడం మంచిదని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.

మొలక శాతం పరీక్షించాలి



తప్పనిసరి పరిస్థితుల్లో విత్తనాలు బయట కొనుగోలు చేయాల్సి వస్తే లైసెన్సు ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాల మొలకశాతం చెక్ చేసుకోవాలి. మొలకశాతం తక్కువ ఉన్న విత్తనాలు తీసుకోవద్దు.

– హరికృష్ణ, ప్రాజెక్టు అగ్రికల్చర్ ఆఫీసర్, ఐటీడీఏ, సీతంపేట



వరి నారు పొలం (ఫైల్)

పాటించాల్సిన జాగ్రత్తలు...

- వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు సమయంలో తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలి. బిల్లుపై విక్రయదారుడి పేరు, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, నికర తూకం, నికర ధర, లాట్ నంబర్, విత్తనరకం, గడువుతేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా జాగ్రత్తపడాలి. లూజు విత్తనాలను కొనుగోలు చేయరాదు. గడువుదాటిన విత్తనాల జోలికి వెళ్లవద్దు. కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్లు నుంచి సంచి, డబ్బాలపై సీల్ ఉందా? లేదా? అని చెక్ చేసుకోవాలి. విక్రయదారులు ఇచ్చే కరపత్రాలు తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలను పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలి.
- మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయాధికారిని సంప్రదించాలి. విత్తనం కొనుగోలు చేసిన వెంటనే పరీక్షించాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి.

క్లుప్తంగా

హోంగార్డ్ కుటుంబానికి చేయూత



చెక్కును హోంగార్డ్ సతీమణి ధనలక్ష్మికి అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ పార్వతీపురం మన్యం ఆర్టీఏ విభాగంలో విధులు నిర్వహిస్తూ, ఇటీవల హార్ట్‌స్ట్రోక్‌తో మృతిచెందిన కె.మహేశ్వరరావు కుటుంబానికి సిబ్బంది ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు హోంగార్డు చేయూత కింద ఒకరోజు అలవెన్స్ రూ.3.20 లక్షల చెక్కును మృతుడి సతీమణి కె.ధనలక్ష్మికి ఎస్పీ ఎం.దీపిక జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు, హోంగార్డ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెట్టంగిలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగిలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది.ఈనెల 13న ఎన్నికల రోజున గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన తగాదాతో అప్రమత్తమైన పోలీసులు ప్రస్తుతం గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం వచ్చేంతవరకు పోలీసు పికెట్ ఉంటుందని ఎస్సై షేక్ ఫకృద్దీన్ సోమవారం తెలిపారు.

కొఠియా గ్రామాల్లో విద్యుత్ మీటర్లు



గంజాయిభద్ర మాజీ సర్పంచ్ గెమ్మెల బిసు

సాలూరు రూరల్: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాలైన కొఠియా పంచాయతీలోని గంజాయిభద్ర తదితర గ్రామాల్లో విద్యుత్ మీటర్లు అమర్చినట్లు గంజాయిభద్ర మజీ సర్పంచ్ గెమ్మెల బీసు తెలిపారు. ఆయన మంగళవారం ఈ మేరకు విలేకరులతో మాట్లాడుతూ మార్చి 28వ తేదీన ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది కొఠియా గ్రామాల్లో ఇంటింటికీ విద్యుత్ మీటర్లు అమర్చే ఏర్పాట్లు చేస్తుంటే ఒడిశా అధికారులు వారిని అడ్డుకున్న విషయం తెలిసిందేనన్నారు. అయితే ఆ విద్యుత్ మీటర్లను ఇంటింటికీ గ్రామపెద్దగా పంపిణీ చేశామన్నారు. అయితే ప్రస్తుతం ఆ మీటర్లను ఇంటింటికీ బిగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏజెన్సీ గ్రామాల గిరిజనులకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు.

ఏటీఎంలో చోరీ యత్నం



దుండగులు తెరిచిన కెనరా బ్యాంక్ ఏటీఎం ఫ్రంట్ డోర్

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో గల కెనరా బ్యాంక్ ఏటీఎం కేంద్రంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. దీనిపై కెనరా బ్యాంక్ మేనేజర్ ఆమిటి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలోని ఆంజనేయపురంలో కెనరా బ్యాంక్ వద్ద ఉన్న ఏటీఎం కేంద్రంలో మంగళవారం రాత్రి దొంగలు చొరబడి ఏటీఎం ఫ్రంట్ డోర్ పగలగొట్టి చోరీకి యత్నించారు. అయితే ఏటీఎం నుంచి ఎలాంటి నగదు చోరీ జరగలేదని మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏటీఎంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఏటీఎంలో చోరీకి వచ్చిన దుండగుడు మాస్క్ వేసుకుని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎలాగైనా నిందితుడిని పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹155	₹280	₹290

ఇంటింటా పాడిపంట

- సాగులో పోటీ..దిగుబడిలో మేటి
- ఏటా లక్షల్లో ఆదాయం
- కరువును జయిస్తున్న రైతులు



మిరప పంటకు సాగునీరు అందిస్తున్న రైతు



పాల సొసైటీలో పాలుపోస్తున్న పాడిరైతులు

రామభద్రపురం: పేరుకే అది పల్లె. చూస్తే పట్టణాన్ని తలపిస్తుంది. ఈ పల్లె చుట్టూ సారవంతమైన భూములు, కనుచూపు మేర ఎటు చూసినా పచ్చటి పంట పొలాలు, పండ్ల తోటలు, కూరగాయల పంటలు, పాడి పశువులు. పాడి పంటలు తప్ప అన్య మెరుగని ఊరు ఇది. పంటల సాగులో అధిక దిగుబడులు సాధిస్తూ పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచిన ఆ ఊరే రామభద్రపురం. సుమారు 3500 పైబడి కుటుంబాలు ఉన్న ఈ గ్రామం పాడి,పంటలతో తులతూగుతూ మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. పశుపోషణతో పాటు ఉద్యాన పంటలతో విరాజిల్లుతోంది. జిల్లాలోని పల్లెల్లో రామభద్రపురంలో దాదాపుగా 70 నుంచి 80 శాతం వరకు ప్రతి ఇంటిలోనూ ఉద్యాన పంటలు పండించడంతో పాటు పాడిపశువులు పెంచేందుకు గ్రామస్తులు చేస్తున్న కృషి ఎందరికో ఆదర్శం. ఇక్కడి రైతులు వరితో పాటు అన్ని రకాల కూరగాయ పంటలు సాగుచేస్తారు. ఆకుకూరలు, బెండ, దొండ, టమాటో, బీర, స్వీట్‌కార్న్, వంగ, కాలిఫ్లవర్, క్యాబేజీ తదితర కూరగాయల పంటలు, బంతి, కనకంబరాలు వంటి పూలు పండిస్తున్నారు.

పంటల సాగులో పోటీతత్వం

గ్రామంలో తాము ఏ పంట సాగు చేస్తున్నమనే దానికంటే అవతలి రైతు కంటే ఎక్కువ దిగుబడి సాధించాలనే పోటీతత్వం ఇక్కడి రైతుల్లో ఉంది. సుమారు 50 శాతం మంది రైతులు నేలబావులు, సొంత డబ్బుతో చిన్న చిన్న బోరుబావులు తవ్వుకుని వాటి ద్వారా సాగునీరు అందిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఒకరికి మించి ఒకరు దిగుబడులు సాధిస్తున్నారు. ఒక్కో రైతు కనీసం అరెకరాకు తగ్గకుండా అంతర పంటల సాగుతో కూరగాయ పంటలు సాగు చేస్తూ వేల రూపాయలు ఆదాయం పొందుతున్నాడు. గ్రామంలో అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ ఉండడంతో ఇక్కడికి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల వ్యాపారులే కాకుండా ఇతర రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వ్యాపారులు నేరుగా వ్యాన్‌లతో వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.



గ్రామాన్ని ఆనుకుని ఉన్న పచ్చటి పంట పొలాలు

2వేల వరకు పాడి పశువులు

గ్రామంలో ఆవులు, గేదెలు 2వేల వరకు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ దాదాపు 20 సెంట్ల నుంచి అరెకరా వరకూ పాడి పశువులకు పచ్చ గడ్డి సాగుచేస్తున్నారు. ఆ గడ్డితో పాడి పశువుల దాణా ఖర్చు తగ్గించుకోవడంతో పాటు పాల దిగుబడి పెంచుకుంటూ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఏడాదికి ఈ గ్రామంలో రైతులు సుమారు రూ.కోటి వరకూ ఆదాయం పొందుతున్నారు. తీవ్ర వర్షాభావంతో వరి సాగు లేక కరువు ఏర్పడినా కూడా దాన్ని సైతం జయిస్తూ రైతన్నలు ఆనందంగా జీవనం సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతుభరోసా పథకం పేరుతో అందజేస్తున్న పెట్టుబడి సాయం తమకు కలిసి వస్తోందని, మరింత ఉత్సాహంతో పంటలు సాగుచేస్తున్నామని రైతులు చెబుతున్నారు.



కూరగాయల మార్కెట్‌కు కూరగాయలు తీసుకెవెళ్తున్న రైతులు



ఆకు కూరలు తీసుకువెళ్తున్న మహిళా రైతు

మహిళా బాగస్వామ్యంతో

ఇంటికి ఇల్లాలే వెలుగన్న నానుడి ఇక్కడ రుజువవుతుంది.ఆ గ్రామంలో పాడి పశువుల పోషణలోను, పంటలు పండించడంలోనూ మహిళలదే కీలక పాత్ర. నిత్యం పశుగ్రాసం అందించడం మొదలు..పంటలు దిగుబడి సాధించేవరకూ కుటుంబ యజమానికి చేదోడు వాదోడుగా మహిళలు నిలుస్తున్నారు. ప్రతిరోజూ వేకువ జామునే లేచి పంట పొలాలకు వెళ్లి కూరగాయలు కోయడం, మార్కెట్‌కు తెచ్చి విక్రయించడం చేస్తుంటారు. పాడి పంటలతో ఆదాయం పెరగడంతో తమ చిన్నారులను ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు.

పంటలే జీవనాధారం



మా గ్రామంలో సుమారు ప్రతి ఇంటికి పాడి ఆవులు, ఉద్యాన పంటలు ఉన్నాయి. నేను రెండు పాడి పశువులు పోషించడంతో పాటు కూరగాయలు వేశాను. పొట్టి చిక్కుడు పంటలో అంతర పంటగా బీర పంట వేశాను, బీర సాగు వట్టిపోయింది.కొద్ది రోజుల్లో పొట్టి చిక్కుడు పంట కోతకు అందివస్తుంది.

మర్రాపు బంగారమ్మ, రైతు, రామభద్రపురం

పంటల సాగుపైనే చర్చ



పాడి పంటలకు రామభద్రపురం ఆదర్శంగా నిలుస్తుంది. గ్రామంలోని రైతులు వ్యవసాయ సాగుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. గ్రామంలోని ఏ ఇద్దరు రైతులు కలిసినా పాడి పశువుల పోషణ, పంటల సాగుపైనే చర్చిస్తుంటారు. ఎలాంటి పంట పెట్టాలి? పాడి ఆవు ఎన్ని పాలు ఇస్తుంది.పెట్టుబడి ఎంతవుతుంది.పంటలో దిగుబడి సాధించేందుకు ఏం చేయాలనే అంశాలపైనే మాట్లాడుతుంటారు. ఇదే విషయాలపై వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు పాటిస్తున్నారు. మంచి సారవంతమైన భూములు కలిగి ఉండడంతో పాటు శ్రమించే గుణం ఎక్కువగా ఉండడం వల్ల ఇక్కడి రైతులు పాడి పంటల సాగులో ఆదర్శంగా నిల్తస్తున్నారు.

వి.హైమ, వీహెచ్‌ఏ, రామభద్రపురం

ప్రకృతిసాగుతో ఆరోగ్యం



ప్రకృతి సాగు పద్ధతిలో కూరగాయలు

- ఈ ఖరీఫ్ లక్ష్యం వేల 58,882 ఎకరాలు
- ప్రకృతి సాగు చేసే రైతులు 58,279 వేల మంది



ప్రకృతి సాగు చేయడానికి రైతులకు సిద్ధం చేసిన నువ్వు విత్తనాలు

విజయనగరం ఫోర్ట్: ప్రస్తుత కాలంలో వయసుతో సంబంధం లేకుండా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. గతంలో 50 ఏళ్లు దాటిన వారికి బీపీ, షుగర్ వంటి వ్యాధులు వచ్చేవి. ఇప్పుడు 20, 30 ఏళ్లకే ఈ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. మానవుని ఆహారపు అలవాట్లలో మార్పు రావడంతో పాటు పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం కారణంగా తక్కువ వయసులోనే వ్యాధుల బారిన పడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి సాగు పద్ధతిలో పంటల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులకు చెబుతోంది. అందుకు అనుగుణంగా అధికారులు కూడా చర్యలు చేపడుతున్నారు. రసాయన ఎరువులతో సాగు చేసే పంటల ఆహారాన్ని తినడం వల్ల అనారోగ్య సమస్యలు రావడంతో పాటు చీడ, పీడల బెడద కూడా ఉంటుంది. ప్రకృతిసాగు పద్ధతిలో అయితే చీడపీడల బెడద పెద్దగా ఉండదు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పెసర, మినుము, కూరగాయలు, పండ్ల తోటలు ప్రకృతి సాగు పద్ధతిలో చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆచరిస్తున్న రైతులు

2016లో ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటైనప్పుడు ప్రకృతి సాగు పద్ధతులను కేవలం 10 మండలాల్లో మాత్రమే రైతులు పాటించేవారు. ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని మండలాల్లో రైతులు పాటిస్తున్నారు. సమాజంలో కొత్త, కొత్త రోగాలు వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు కూడా ఆరోగ్యపై శ్రద్ధ వహిస్తున్నారు.

8 ఏళ్లలో గణనీయంగా పెరిగిన ప్రకృతి సాగు

ప్రకృతి సాగు పద్ధతిని రైతులు గతంలో పెద్దగా ఆచరించేవారు కాదు. అయినప్పటికీ కొన్నేళ్లుగా ప్రకృతి సాగు పెరుగుతూ వస్తోంది. గడిచిన 8 ఏళ్ల కాలంలో గణనీయంగా ప్రకృతి సాగు పెరిగింది. 2016లో 1368 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. ఈ ఏడాదిఖరీఫ్‌లో 58,882 ఎకరాల్లో సాగు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ప్రకృతి సాగులో భాగంగా వరి పంట 32,461 ఎకరాల్లో, మొక్కజొన్న పంట 3434, నువ్వు పంట 17,326 ఎకరాల్లో, పండ్ల తోటలు 5661 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు.

జూలైలో ఖరీఫ్‌కు తోటపల్లి నీరు విడుదల

- గత ఐదు సీజన్లలో తోటపల్లి పాత ఆయకట్టుకు నీటి పంపిణీ
- శివారు ఆయకట్టులో పెరిగిన పంటల దిగుబడి



వీరఘట్టం: పాత ఆయకట్టుకు ప్రతి ఏటా ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో నీరందిస్తూ పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను తోటపల్లి జలాశయం సస్యశ్యామలం చేస్తోంది. ఈ మేరకు గడిచిన ఐదు ఖరీఫ్ సీజన్లలో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకుండా జలవనరులశాఖ అధికారులు ప్రణాళికా బద్ధంగా నీటిని పంపిణీ చేశారు. అంతేకాకుండా ఓ పక్క కాలువల ఆధునికీకరణ పనులు చేపడుతూనే మరో పక్క సాగునీరు పంపిణీ చేస్తూ సాగును సస్యశ్యామలం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గడిచిన ఐదేళ్లుగా పంటల దిగుబడి పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సకాలంలో నీటిని పంపిణీ చేసేందుకు జలవనరులశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జూలై మొదటివారంలో తోటపల్లి పాత ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు.

ఇంతవరకు జరిగిన ఆధునికీకరణ పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులపై దృష్టి సారించింది.37.536 కి.మీలు పొడవున్న ఎడమ కాలువలో ఇంతవరకు 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. అలాగే 17.616 కి.మీ పొడవున్న కుడి కాలువలో 9.376 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టారు. మొత్తం 55.152 కి.మీకు గాను ఇంతవరకు 26.919 కి.మీ అనగా 48 శాతం పనులు చేపట్టారు. అంతేకాకుండా ఎడమకాలువలో అచ్చపువలస వద్ద, 6వ బ్రాంచ్ వద్ద, ఎం.రాజపురం వద్ద, కత్తులకవిటి వద్ద వెడల్పయిన వంతెనలు నిర్మించి వాహనరాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇలా నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గత ఖరీఫ్‌లో చర్యలు చేపట్టి శివారు వరకు సాగునీరందించారు. ఇలా ఒక పక్క ఆధునికీకరణ పనులు చేపడుతూ మరో పక్క గత ఐదు ఖరీఫ్ సీజన్లలో సకాలంలో కాలువలకు సాగునీరందిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి ఆయకట్టును సస్యశ్యామలం చేసింది. ఈ ఏడాది కూడా సకాలంలో నీరు విడుదల చేసి శివారు ఆయకట్టుకు తొలి ప్రాధాన్యంగా నీటి పంపిణీ చేయనున్నారు.

జూలైలో నీటి విడుదల



గత ఖరీఫ్ సీజన్‌లో శివారు రైతులు ఇబ్బందులు పడకుండా సాగునీరు పుష్కలంగా అందించాం. దీంతో గతేడాది పంటల దిగుబడి కూడా బాగా వచ్చింది. శివారు ప్రాంతంలో కాలువల్లో, డిస్ట్రిబ్యూటరీ చానల్స్‌లో, బ్రాంచ్ కాలువల్లో ప్రస్తుతం పేరుకు పోయిన పిచ్చి మొక్కలు తొలగించి జూలైలో నీటి విడుదలకు చర్యలు చేపడుతున్నాం.

దమలపాటి రవికుమార్, డీఈఈ జలవనరులశాఖ, పాలకొండ డివిజన్

సీతంపేటలో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

సీతంపేట: మండల కేంద్రం సీతంపేటలో బుధవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. జీడిమామిడి తోటలకు ఈ వర్షం వల్ల నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

భామిని: మండలంలో రెండురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. రోడ్లు గోతులు, వంతెనలలో వర్షపు నీరు చేరుతుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరుతుండండంతో కూరగాయల పంటల రైతులకు ఊరట కలిగిస్తోంది.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ రచయితలు శ్రీరామ చక్రధర్, శారద దీప్తి శిక్షణ కార్యక్రమానికి హాజరైన చిన్నారులు, పెద్దలకు వ్యక్తిత్వ వికాస సూత్రాలను వివరించారు. మనిషి ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమయ్యే వ్యక్తిత్వం, గుణగణాలను వివరించారు. శిక్షణ శిబిరానికి 200 మంది హాజరు కాగా ఆలయ అర్చకులు చాణక్య, హర్షలు శాంతి మంత్రాలు, ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, చీఫ్ ఆడిటర్ బాలాజీ, ఉమాదేవి దంపతులు, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలో చోరీ

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీలో గల రైతుభరోసా కేంద్రంలో జరిగిన చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఎస్సై పి.నరసింహమూర్తి బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాశీపట్నం గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారి సమీపంలోని ఆర్‌బీకేలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గొట్టాపు సతీష్‌కుమార్ ఈనెల 10వతేదీన విధులు నిర్వహించి, రైతుభరోసాకేంద్రం తలుపులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. మళ్లీ ఈనెల 14వతేదీన ఆర్‌బీకేలో విధులు నిర్వహించేందుకు వచ్చిన ఆయన తలుపులు తీసి, చూడగా టీవీ, కంప్యూటర్ మానిటర్, ప్రింటర్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. దీంతో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సతీష్‌కుమార్ ఫిర్యాదుచేయడంతో కేసునమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.